**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

-----------------

ప్రేమ ముసుగులోన కామపిచ్చిగ యువత
కానిపనులుజేయ హానికలుగు
స్వీయరక్షణమ్ము శ్రేయస్సు నిచ్చును
విన్నవారు భువిన వెలుగు చుండ్రు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 197 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 26-10-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




## వైన్స్ షాపుల డ్రాకు హైకోర్టు

# గ్రీన్ సిగ్నల్



### మద్యం షాపుల డ్రాకు తొలగిన అడ్డంకులు

- 27న యధావిధిగా కలెక్టర్ల సమక్షంలో డ్రాలు
- ఏర్పాట్లు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ ఆదేశాలు



**హైదరాబాద్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణలో మద్యం షాపుల డ్రాకు అడ్డంకులు తొలగిపోయాయి. వైన్ షాపుల డ్రాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో అక్టోబర్ 27న యధావిధిగా మద్యం షాపుల డ్రా పక్రియను ఎక్సైజ్ శాఖ నిర్వహించనుంది. కాగా, వైన్ షాపుల కేటాయింపు కోసం గడువు ముగిసిన తర్వాత కూడా దరఖాస్తులు తీసుకున్నారని పేర్కొంటూ ఐదుగురు మద్యం వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై శనివారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ నెల 18వ తేదీ వరకు ఉన్న మద్యం టెండర్ల గడువును 23వ తేదీ వరకు పెంచారని పిటిషనర్ తరఫు న్యాయవాదాలు

-మిగతా 2 లో

## కాంగ్రెస్‌ను ఓడిస్తేనే

# బుద్ధి వస్తుంది

### జూబ్లీహిల్స్ నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర సాగాలి

- లేదంటే అదే నిర్లక్ష్యంతో పాలన సాగిస్తారు
- పార్టీలో చేరిన వారితో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. రెండేళ్లలో కేసీఆర్‌ని తిట్టడం తప్ప సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణకు ఏమి చేశారని నిలదీశారు. రాష్ట్రంలో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం వచ్చిందని కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం అవుతుందని

-మిగతా 2 లో



## చొరబాటుదారులను

# ఉపేక్షించేది లేదు

- ప్రతి ఒక్క చొరబాటుదారుడిని గుర్తిస్తాం
- ఓటరు జాబితా నుంచి పేరును తొలగిస్తాం
- బీహార్ ప్రచారంలో అమిత్ షా స్పష్టీకరణ

**పాట్నా,**
బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఖగడియా జిల్లాలో అధికార, ప్రతిపక్ష నేతలు నేడు పోటాపోటీ ప్రచార సభలు నిర్వహించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' ను వ్యతిరేకించిందంటూ 'ఇండియా' కూటమిపై కేంద్రమంత్రి అమిత్ షా విరుచుకుపడ్డారు. ప్రతి ఒక్క చొరబాటుదారుడిని గుర్తించి, వారి స్వదేశానికి తరలిస్తామన్నారు. బిహార్‌లో జంగల్‌రాజ్ తిరిగి వస్తుందా? లేదా రాష్ట్రం అభివృద్ధి మార్గంలో కొనసాగుతుందా? అనేది ఈ ఎన్నికలు నిర్ణయిస్తాయన్నారు. చొరబాటుదారులను కాపాడేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్ని యాత్రలైనా నిర్వహించ నివ్వండి. ఏం చేసినా.. వారిని ఆయన రక్షించలేరు. ప్రతి ఒక్క చొరబాటుదారుడిని గుర్తిస్తాం. ఓటరు జాబితా నుంచి పేరును తొలగిస్తాం. వారి స్వదేశానికి పంపిస్తాం అని అమిత్ షా స్పష్టం చేశారు. ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కేవలం తన కుటుంబ

-మిగతా 2 లో



## నిబంధనలకు విరుద్ధంగా

# బీఆర్ఎస్ ప్రచారం


- సొంత పత్రిక,ఛానల్‌లో విచ్చలవిడిగా ప్రసారాలు
- ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్

**హైదరాబాద్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ దగ్గర పడుతున్న కొద్దీ రాజకీయం మరింత రసవత్తరంగా మారుతోంది. నామినేషన్ల పక్రియ ముగియగా.. ఇప్పుడు ప్రచార పర్వం ఊపందు కుంది. నియోజకవర్గ పరిధిలో అధికార బీఆర్ఎస్.. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు హోరాహోరీగా ప్రచారం చేస్తున్నాయి. అయితే, బీఆర్ఎస్ ప్రచారం పర్వంపై కాంగ్రెస్ ఈసీని ఆశ్రయించింది. బీఆర్ఎస్ పార్టీ నేతలు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపిస్తూ ఈసీకి ఫిర్యాదు ఇచ్చారు.

-మిగతా 2 లో

## ఇంటర్ విద్యావిధానంలో మార్పులు

- వచ్చే ఏడాది నుంచే అమల్లోకి కొత్త సిలబస్
- ఫిబ్రవరి 18 నుంచి ఇంటర్ పరీక్షలు



**హైదరాబాద్,**
తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్ విడుదలయ్యింది. 2026 ఫిబ్రవరి 25 వ తేదీ నుంచి మార్చి 18 వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తామని ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలను ఆయన మీడియాకు తెలిపారు. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లో

-మిగతా 2 లో

## ఉద్యోగులకు ఆధార్ లింక్ మస్ట్

- లేకుంటే జీతాలు నిలిపివేత
- వేతనాల చెల్లింపుపై ఆర్థికశాఖ కీలక నిర్ణయం
- పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తేనే జీతాల చెల్లింపు



**హైదరాబాద్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణలో ఉద్యోగుల వేతనాల చెల్లింపుపై ఆర్థికశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మంత్రివర్గ నిర్ణయానికి అనుగుణంగా ఉద్యోగులు, సిబ్బంది కచ్చితంగా ఆర్థికశాఖ నిర్వహణ పోర్టల్ (ఐఎఫ్ఎంఐఎస్)కు ఆధార్ లింక్ చేయాల్సిందేనని ఆదేశించింది. ఈ అర్ధరాత్రి వరకు అందరూ ఆధార్ లింక్ చేయాలని స్పష్టం చేసింది. లేదంటే వేతనాలు నిలిచిపోతాయని స్పష్టం

-మిగతా 2 లో

## కర్నూలు బస్సు దుర్ఘటనలో వీడిన మిస్టరీ

- ప్రమాదానికి ముందే బైకర్ పడిపోయినట్లు గుర్తింపు
- బైకును తీసే లోపే లాక్కెళ్లిన బస్సు..అంతలోనే ప్రమాదం
- వివరాలు వెల్లడించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్



**కర్నూలు,**
తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదం నింపిన కర్నూలు బస్సు ప్రమాద దుర్ఘటన మిస్టరీ వీడింది. బస్సు ప్రమాదంపై పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో మంటలు చెలరేగి 19 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నడిపిన శివశంకర్ అనే యువకుడు కూడా మృతి చెందాడు. అయితే, బైక్‌పై శివశంకర్ వెనుక కూర్చున్న వ్యక్తిని ఎర్రిస్వామిగా పోలీసులు గుర్తించారు. అతన్ని పలు కోణాల్లో ప్రశ్నించి కీలక ఆధారాలు సేకరించారు. కేసు వివరాలను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మీడియాకు వెల్లడించారు. శుక్రవారం జరిగిన బస్సు ప్రమాద ఘటన దర్యాప్తులో భాగంగా బైక్ నడుపుతూ చనిపోయిన శివశంకర్‌తో పాటు వెనుకాల కూర్చున్న వ్యక్తి ఎర్రిస్వామి అలియాస్ నానిగా గుర్తించాం. అతన్ని పలు కోణాల్లో విచారించాం. ఎర్రిస్వామి, పల్సర్ బైక్

-మిగతా 2 లో

## పాక్ సరిహద్దులో త్రిశూల్ విన్యాసాలకు త్రివిధ దళాలు సిద్ధం

అక్టోబరు 30 నుంచి నవంబరు 10 వరకు పెద్దఎత్తున విన్యాసాలు




## అమరులకు..ఉద్యమకారులకు

# తీరని అన్యాయం

### వారిని ఆదుకోవడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం

- గత పదేళ్లలో వారికి సరిగా ఉద్యోగాలు ఇవ్వలేదు
- అంతర్గతంగా తాను కొట్లాడినా న్యాయం జరగలేదు
- జాగృతి జనంబాట ప్రారంభంలో కవిత భావోద్వేగం




**హైదరాబాద్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భావోద్వేగానికి లోనయ్యారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అమరుల స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యమకారుల కోసం పోరాడలేకపోయామని, అమరవీరుల కుటుంబాలకు అనుకున్నంత న్యాయం చేయలేకపోయామని భావోద్వేగానికి లోనయ్యారు. ఉద్యమకారులకు న్యాయం జరిగేవరకు పోరాడనందుకు బహిరంగ

-మిగతా 2 లో

## ఈ దశాబ్దం మోదీదే

- సామాన్యుల సాధికారతే లక్ష్యంగా సంస్కరణలు
- ఏడాదిలోపే సూపర్ సిక్స్ పథకాల అమలు
- జాతీయవార్తా సంస్థ ఇంటర్వ్యూలో చంద్రబాబు



**అమరావతి, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఈ దశాబ్దం మోదీదే అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఎన్డీయే ప్రగతిశీల ప్రభుత్వమని కొనియాడారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం సామాన్యుల సాధికారతే లక్ష్యంగా సంస్కరణలు తీసుకువస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఎన్నికల హామీ 'సూపర్ సిక్స్'ను విజయవంతంగా అమలు చేస్తోందని వెల్లడించారు. జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో

-మిగతా 2 లో

## చొరబాటుదారులను ఉపేక్షించేది లేదు

మొదటి తరువాయి

ప్రయోజనాలపైనే దృష్టి సారించారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నీతీశ్‌కుమార్ మాత్రం రాష్ట్ర సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఆర్జేడీ పాలనలో హత్యలు, దోపిడీలు తదితర అనేక నేరాలు యథేచ్ఛగా జరిగాయని, కానీ.. ఎన్డీయే హయాంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని చెప్పారు. జంగల్‌రాజ్ తిరిగి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకోవడం లేదన్నారు. ఇదిలావుంటే కేవలం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకే ఎన్నికల్లో పోటీ చేయడం లేదని, బిహార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తెలిపారు. ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే.. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు 20 రోజుల్లోపు చట్టం తీసుకొస్తామన్నారు. 20 నెలల్లో నియామకాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఖగడియాలోని గోగ్రీలో నిర్వహించిన ప్రచార సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. బిహార్‌ను నంబర్ వన్‌గా మార్చేందుకు.. పెట్టుబడులు తీసుకురావడం, విద్యను ప్రోత్సహించడం, వైద్య సౌకర్యాలను మెరుగుపర్చడం అవసరమని పేర్కొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా బీఆర్ఎస్ ప్రచారం

మొదటి తరువాయి

ఈ విషయంలోనే టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్. వీ. కర్ణన్‌ను కలిశారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ నిబంధనలకు విరుద్ధగా బీఆర్ఎస్ పార్టీ తమ స్వంత పత్రిక, మీడియాలో విచ్చలవిడిగా ప్రసారాలు చేస్తోందని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన సామా రామ్మోహన్ రెడ్డి.. నిబంధనలకు విరుద్ధంగా బిఆర్ఎస్ పార్టీ తమ స్వంత పత్రికల్లో విచ్చల విడిగా ప్రచురిస్తున్న తప్పుడు వార్తలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఎలక్షన్ కమిషన్ నియమావళి ఉల్లంఘన కింద పరిగణిస్తూ ఇవన్నీ కూడా బీఆర్ఎస్ అభ్యర్థి ఖర్చుల కింద పరిగణించాలని ఫిర్యాదు చేశామన్నారు. మరే ఇతర పార్టీలకు సంభందించిన వార్తా కథనాలను బిఆర్ఎస్ పార్టీ అనుబంధ ప్రసార సాధనాల్లో ప్రచురించటం లేదన్నారు. కనీసం మీడియా విలువలను ఏమాత్రం పాటించకుండా నిస్సిగ్గుగా ఆ పత్రికలు వ్యవహరించటాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు సామ. తమ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని ఉల్లంఘనలకు పాలుపడుతున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పట్ల తగు చర్య తీసుకోవాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారిని కోరామన్నారు.

## కర్నూలు బస్సు దుర్ఘటనలో వీడిన మిస్టరీ

మొదటి తరువాయి

నడుపుతున్న శివశంకర్ ఇద్దరూ కలిసి లక్ష్మీపురం గ్రామం నుంచి అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2గంటలకు తుగ్గలికి బయల్దేరారు. మార్గ మధ్యలో అర్ధరాత్రి 2.24 గంటలకు కియాషోరూమ్ సమీపంలోని ఉన్న పెట్రోల్ బంక్ వద్ద రూ.300 పెట్రోల్ పోయించుకున్నారు. అక్కడి నుంచి బయల్దేరిన కొద్ది సేపటికే చిన్నటేకూరు సమీపంలో శివశంకర్ బైక్ నడుపుతూ స్కిడ్ అయి.. రోడ్డుకు కుడివైపు ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెనుక ఉన్న ఎర్రిస్వామి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రోడ్డు మధ్యలో పడి ఉన్న శివశంకర్‌ను పక్కకు తీసి, బైక్‌ను తీద్దామనుకునే సరికి అంతలోనే వేగంగా వచ్చిన బస్సు బైక్‌ను ఢీకొని కొద్ది దూరం ఈడ్చు కెళ్లింది. బస్సు కింద మంటలు రావడంతో ఎర్రిస్వామి భయపడి అక్కడి నుంచి తన స్వగ్రామం తుగ్గలి వెళ్లి పోయాడు. బస్సు ప్రమాద ఘటనపై ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనగిస్తున్నాం అని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.

## ఉద్యోగులకు ఆధార్ లింక్ మస్ట్

మొదటి తరువాయి

చేసింది. అన్ని శాఖల్లో కలిపి శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు మొత్తం 10.14 లక్షల మంది ఉన్నారు. వీరందరి పేర్లు, హోదా, ఆధార్, ఫోన్ నంబర్లు తదితర వివరాలన్నీ ప్రతి నెల 10 వరకు ఆర్థికశాఖ నిర్వహణ పోర్టల్ లో నమోదు చేయాలని గత నెలలో ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఈ నెల 16 వరకు సగం మంది వివరాలు కూడా నమోదు చేయలేదు. ఈ క్రమంలో వివరాలివ్వనివారి జీతాల బిల్లులు ఈ నెలలో ఆమోదించేది లేదని ఆర్థికశాఖ హెచ్చరించింది. ఉద్యోగుల సమగ్ర వివరాలన్నీ లేకపోవడంతో కొన్నిచోట్ల అక్రమాలు జరుగుతున్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులందుతున్నాయి. కొన్ని కార్యాలయాల్లో తాత్కాలిక ఉద్యోగులు మానేసినా, అనధికారికంగా సుదీర్ఘ సెలవులో వెళ్లినా వారి పేర్లతో వేతనాలు డ్రా చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పేరు, ఆధార్, సెల్ నంబర్లతో పోల్చిచూస్తే ఎంత మంది ఉద్యోగులు ఉన్నారనే స్పష్టమైన వివరాలు అందుతాయని భావించి వివరాలు పంపాలని కోరగా పలు కార్యాలయాలు స్పందించడం లేదు. ఈ క్రమంలో మరోమారు ఆర్థిక శాఖ గట్టి హెచ్చరికలు జారీ చేసింది.

## ఇంటర్ విద్యావిధానంలో మార్పులు

మొదటి తరువాయి

కూడా ల్యాబ్స్, ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ఉంటాయని, ఇంగ్లీష్‌లో ఉన్నట్లుగానే మిగతా భాషల్లోనూ ప్రాక్టీకల్స్ నిర్వహిస్తామని వెల్లడించారు. 12 ఏళ్ల తర్వాత ఇంటర్ సిలబస్‌లో మార్పులు జరగబోతున్నట్లు తెలిపారు. మ్యాథ్స్, ఫిజిక్స్ , కెమిస్టీ, బోటనీ, జువాలజీ సిలబస్ మారబోతున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ విద్యా విధానంలో మార్పులతో పాటు పరీక్షల తేదీలను ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య విడుదల చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో కూడా ల్యాబ్స్ , ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఉంటాయి.. అలాగే, ఇంటర్ సిలబస్ లోనూ మార్పులు చేసినట్లు ప్రకటించారు. 12 సంవత్సరాల తర్వాత మ్యాథ్స్, ఫిజిక్స్ కెమిస్టీ, బొటనీ, జువాలాజీలో సిలబస్ లో మార్పులు జరిగాయని ప్రకటించారు. హ్యూమానిటీస్ స్జబెక్టుల్లో యాక్టివిటీ బేస్డ్ సిలబస్ ఏప్రిల్ మొదటి వారంలో బుక్స్ అందుబాటులోకి వస్తాయని ఇంటర్ బోర్డు సెక్రటరీ వెల్లడించారు. అలాగే, కొత్త కోర్స్ కోర్స్ ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య చెప్పుకొచ్చారు. ఇంగ్లీష్ లో ఉన్నట్టు గానే మిగతా లాంగ్వేజెస్ లోనూ ప్రాక్టికల్స్ ఉంటాయి. ఇకపై 80 మార్కులు ఎక్స్‌టర్నల్, 20 మార్కులు ఇంటర్నల్ మార్కులుగా ఉంటాయన్నారు. ల్యాబ్ ప్రాక్టికల్స్ ప్రతి సంవత్సరం 15 మార్కుల చొప్పున నిర్వహించనున్నారు. అంతేకాకుండా, ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నట్లు ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య తెలిపారు.

## పాక్ సరిహద్దులో త్రిశూల్ విన్యాసాలకు త్రివిధ దళాలు సిద్ధం

### అక్టోబరు 30 నుంచి నవంబరు 10 వరకు పెద్దఎత్తున విన్యాసాలు

**న్యూడిల్లి**

భారత త్రివిధ దళాలు ఉమ్మడిగా 'త్రిశూల్ విన్యాసాలకు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ అప్రమత్తమైంది. తన గగనతలంలో ఆంక్షలు విధిస్తూ విమానయాన సంస్థలకు నోటమ్ జారీ చేసింది. అక్టోబరు 30 నుంచి నవంబరు 10 వరకు పాక్ సరిహద్దులోని సర్‌క్రీక్ ప్రాంతంలో భారత త్రివిధ దళాలు పెద్దఎత్తున విన్యాసాలు చేపట్టేందుకు సిద్ధమయ్యాయి. ఈ క్రమంలో పాక్ తన గగనతలంలోని వైమానిక మార్గాలను పరిమితం చేసింది. విశ్లేషకుడు డామియన్ సైమన్ దీనికి సంబంధించి ఒక ఉపగ్రహ చిత్రాన్ని షేర్ చేశారు. 28వేల అడుగుల ఎత్తు వరకు విన్యాసాలు చేసేందుకు గగనతలాన్ని రిజర్వ్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సింధూర్ తర్వాత త్రివిధ దళాలు కలిసి ఉమ్మడిగా ఇంత పెద్ద కసరత్తు నిర్వహించడం గమనార్హం. ఉమ్మడి కార్యాచరణ సామర్థ్యాలు, స్వావలంబనను ప్రదర్శించడమే లక్ష్యంగా దీన్ని ఏర్పాటు చేసినట్లు రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొంది. ఇలాంటి విన్యాసాలు సాధారణ సన్నద్ధత చర్యలే అయినప్పటికీ.. ఆపరేషన్ సింధూర్ తర్వాత భారత సరిహద్దును నిశితంగా గమనిస్తున్నామని చెప్పేందుకే పాక్ తాజాగా నోటమ్ జారీ చేసినట్లు తెలుస్తోంది.

# వైన్ షాపుల డ్రాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

మొదటి తరువాయి

హైకోర్టుకు తెలిపారు. 23వ తేదీకి పెంచడం వల్ల ఐదువేలకు పైగా దరఖాస్తులు అదనంగా వచ్చాయని వివరించారు. ఇది తెలంగాణ ప్రోహిబిషన్ ఎక్సైజ్ యాక్ట్ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఆర్టికల్ 12 (5) ప్రకారం గడువు పెంచడానికి అవకాశం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వివరించారు. ఈ నెల 23న జరగాల్సిన లక్కీ డ్రాను కూడా 27వ తేదీకి పొడిగించారని తెలిపారు. ప్రభుత్వం తరుఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ.. గడువు పెంచడం అనేది తెలంగాణ ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయమని తెలిపారు. గడువు పెంచే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని వివరించారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు ప్రభుత్వ వాదనలతో ఏకీభవించింది. ఈ మేరకు మద్యం దుకాణాల డ్రా పక్రియ నిర్వహించేందుకు ప్రభుత్వానికి అనుమతి ఇచ్చింది. హైకోర్టు నుంచి మద్యం షాపుల డ్రాకు అనుమతి రావడంతో డ్రా పక్రియ ఏర్పాట్లను చేసుకోవాల్సిందిగా ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు 27న మద్యం షాపుల డ్రాకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు మొదలుపెట్టారు. జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా సోమవారం ఉదయం 11 గంటలకు మద్యం షాపుల డ్రా ప్రకియ నిర్వహించ నున్నారు. కాగా, తెలంగాణలోని 2620 మద్యం షాపులకు 95,137 దరఖాస్తులు వచ్చాయి. మద్యం షాపులకు వచ్చిన దరఖాస్తులను డ్రా పద్ధతిలో ఎంపిక చేసి లైసెన్స్‌లు జారీ చేయనున్నారు. డ్రా ఏర్పాట్లను పూర్తి చేయాల్సిందిగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్



సి. హరికిరణ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 2,620 మద్యం షాపుల కోసం భారీ స్థాయిలో 95,137 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాల వారీగా ఈ నెల 27న ఉదయం 11 గంటలకు దరఖాస్తుదారులు, ప్రజల సమక్షంలో జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా మద్యం షాపుల డ్రా పక్రియ కొనసాగనుంది. ఈ డ్రా ద్వారా కొత్త లైసెన్స్‌దారుల ఎంపిక జరగనుంది. అదిలాబాద్‌లో 40 మద్యం షాపులకు 771 దరఖాస్తులు, కోమురం భీం అసిఫాబాద్‌లో 32 షాపులకు 680, మంచిర్యాలలో 73 షాపులకు 1712, నిర్మల్‌లో 47 షాపులకు 3002, జగిత్యాలలో 71 షాపులకు 1966, కరీంనగర్‌లో 94 షాపులకు 2730, పెద్దపల్లి 77 షాపులకు 1507, రాజన్న సిరిసిల్లలో 48 షాపులకు 1381, ఖమ్మంలో 122 షాపులకు 4430, కొత్తగూడెం 88 షాపులకు 3922, జోగులాంబ గద్వాలలో 36 షాపులకు 774, మహబూబ్‌నగర్‌లో 90 షాపులకు 2487, నాగర్‌కర్నూల్‌లో 67 షాపులకు 1518, వనపర్తిలో 37 షాపులకు 757, మెదక్‌లో 49 షాపులకు 1920, సంగారెడ్డి 101 షాపులకు 4432, సిద్దిపేటలో 93 షాపులకు 2782, నల్లగొండ 155 షాపులకు 4906, సూర్యపేట్‌లో 99 షాపులకు 2771, యాదాద్రి భువనగరిలో 82 షాపులకు 2776, కామారెడ్డి 49 షాపులకు 1502, నిజామాబాద్ 102 షాపులకు 2786, మల్కాజిగిరిలో 88 షాపులకు 5168, మేడ్చల్‌లో 114 షాపులకు 6063, సరూర్‌నగర్‌లో 134 షాపులకు 7845, శంషాబాద్‌లో 100 షాపులకు 8536 వికారాబాద్ 59 షాపులకు 1808, జనగామాలో 47 షాపులకు 1697, భూపాలపల్లి 60 షాపులకు 1863, మహబూబాబాద్‌లో 59 షాపులకు 1800, వరంగల్ రూరల్‌లో 63షాపులకు 1958, వరంగల్ అర్బన్‌లో 65 షాపులకు 3175 దరఖాస్తులు వచ్చాయి.

# కాంగ్రెస్‌ను ఓడిస్తేనే బుద్ధి వస్తుంది

మొదటి తరువాయి

చెప్పారు. మోసాన్ని మోసంతోనే జయించాలని కేటీఆర్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్ డివిజన్ బీజేపీ పార్టీ మాజీ అధ్యక్షుడు తోట మహేష్ ముదిరాజ్, తన అనుచరులతో కలిసి శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తోట మహేష్‌తో పాటు ఆయన అనుచరులకు కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరంమీడియాతో కేటీఆర్ మాట్లాడారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికలో హామీలిచ్చి ఒక్క పైసా కూడా సీఎం రేవంత్‌రెడ్డి ఇవ్వలేదని ఫైర్ అయ్యారు. ఓటు కోసం కాంగ్రెస్ నేతలు ప్రమాణం చేస్తారని.. ఆ తర్వాత పట్టించుకోరని ఎద్దేవా చేశారు. మళ్లీ కేసీఆర్‌ని అధికారంలోకి తెచ్చుకోవటానికి.. జూబ్లీహిల్స్ నుంచే జైత్రయాత్ర ప్రారంభం కావాలని మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిస్తే తాము మోసం చేసినా తమకు ఓటు వేశారని.. ఆ పార్టీ నేతలు చెబుతారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులకి మధ్య సయోధ్య లేక కొట్టుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు జాదూగాళ్లు అని దెప్పిపొడిచారు. అన్ని మతాల వారిని, అన్నివర్గాల వారిని కాంగ్రెస్ మోసం చేసిందని ఆక్షేపించారు. మైనార్టీ సబ్ ప్లాన్ పెడతామన్నారని.. అది కూడా ఎందుకు పెట్టలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఓటు అడగటానికి కాంగ్రెస్ నేతలు వస్తే బాకీ కార్డు చూపెట్టాలని సూచించారు. అవ్వా, తాతలకు రూ.4000 పెన్షన్ ఇస్తామని అన్నారని.. ఇచ్చారా అని నిలదీశారు. మహిళలకు రూ. 2500 ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు వాస్తవం కాలేదని, పేదల ఆశలు దెబ్బతిన్నాయని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజల కష్టాలు తగ్గాయి. ఉచిత మంచినీళ్లు, బస్తీ దవాఖానాలు, రూ.5 భోజనం, పింఛన్లు, రంజాన్ తోఫాతో పాటు అనేక పథకాలు అమలు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. ఇప్పుడేమో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను బకాయిలతో ముంచేసింది. వృద్ధులు, రైతులు, మహిళలు అందరిని కాంగ్రెస్ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేం మోసపోయాం.. కానీ ఇప్పుడు జూబ్లీహిల్స్ ప్రజలు మోసపోవద్దు. అందుకే మేం కూడా జూబ్లీహిల్స్‌కు వచ్చి ప్రచారం చేస్తామని గ్రామల నుంచి రైతులు, ప్రజలు చెబుతున్నారని అన్నారు. మోసాన్ని మోసంతోనే జయించాలి. ప్రజల నిజమైన అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తేవాలి. తెలంగాణలోని గరీబోళ్లు, కార్మికులు, రైతులు అందరూ జూబ్లీహిల్స్ వైపు చూస్తున్నారు. జైత్రయాత్ర ఇక్కడి నుంచే ప్రారంభమవుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. వచ్చే నెల 11న జరిగే పోలింగ్‌లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కేటీఆర్ కోరారు. మీ ఓటు తెలంగాణ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. కేసీఆర్ పాలనలో సాధించిన అభివృద్ధిని కాపాడుకుందాం అని ఆయన పిలుపునిచ్చారు.

# అమరులకు..ఉద్యమకారులకు తీరని అన్యాయం

మొదటి తరువాయి

క్షమాపణ చెప్పారు. కాగా, కవిత శనివారం నుంచి 'జాగృతి జనం బాట' కార్యక్రమం నిర్వహించనున్నారు. వరుసగా 4 నెలలపాటు ప్రజలతో ఉండేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకోనున్నారు. నిజామాబాద్ నుంచి జనంబాట కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ప్రజలు కోరుకుంటే కొత్త పార్టీని పెట్టేందుకు కూడా సిద్ధమని కవిత ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కవిత శనివారం 'జాగృతి జనం బాట' పేరుతో రాష్ట్రవ్యాప్త పర్యటనను ప్రారంభించారు. ఈ యాత్రకు ముందుగా అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, అనంతరం మీడియాతో మాట్లాడారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో అమరవీరుల కుటుంబాలకు, తెలంగాణ ఉద్యమకారులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోయామని అంగీకరిస్తూ, వారికి మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం కోసం 1,200 మంది ప్రాణ త్యాగం చేశారని, కానీ అధికారంలోకి వచ్చాక వారి కుటుంబాలకు అనుకున్నంత మేర న్యాయం చేయలేకపోయామని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 500 మంది అమరవీరుల కుటుంబాలకు మాత్రమే ఉద్యోగాలు ఇవ్వగలిగాం. ఉద్యమకారులకు కొన్నిచోట్ల రాజకీయంగా నామమాత్రపు పదవులు దక్కాయి కానీ, వారికి జరగాల్సినంత న్యాయం జరగలేదు. ఎంపిగా ఉన్నప్పుడు పార్టీ అంతర్గత వేదికలపై ఈ విషయం ప్రస్తావించినా, వారి కోసం గట్టిగా కొట్లాడలేకపోయాను. అందుకే ఇప్పుడు బహిరంగంగా క్షమాపణ చెబుతున్నానని కవిత అన్నారు. అమరవీరుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వకపోతే రాబోయే ప్రభుత్వంతోనైనా ఇప్పించి తీరుతామని ఆమె హామీ ఇచ్చారు. 'సామాజిక తెలంగాణ' సాధనే లక్ష్యంగా తాను 33 జిల్లాలు, 119 నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నానని? సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు దక్కే వరకు తన పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. ' తెలంగాణ తల్లి విగ్రహం చేతిలోంచి బతుకమ్మను తీసేశారు. తిరిగి తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మను పెట్టే వరకు పోరాడదాం ' అని పిలుపునిచ్చారు. పాత మనస్పర్థలను పక్కనపెట్టి జాగృతి మాజీ సభ్యులందరూ తిరిగి కలిసి రావాలని, సామాజిక తెలంగాణ కోసం ఐక్యంగా పోరాడాలని కవిత పిలుపునిచ్చారు.

# ఈ దశాబ్దం మోదీదే

మొదటి తరువాయి

భాగంగా వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. బిహార్ సీఎం నీతీశ్ కుమార్, అధికార కూటమి అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తానని వెల్లడించారు. 'భారత్‌లో ఎంతో ఆసక్తిని కలిగించే అంశాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధాని మోదీ 2000 సంవత్సరం నుంచి రాజకీయాల్లో ఉన్నారు. ఆయన ఎల్లప్పుడూ ఎన్నికల్లో విజయం సాధిస్తూనే ఉంటారు. గతంలో ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2014 నుంచి 11 ఏళ్లుగా ప్రధానిగా కొనసాగుతున్నారు. మరో నాలుగు సంవత్సరాలు ఆయనే ఉంటారు. ఈ దశాబ్దం మోదీ (ఖఓ ఓనీటతి)దే. అంటే ఆటోమెటిగ్గా భారతీయులదే' అని చంద్రబాబు వెల్లడించారు. ఇటీవల కేంద్రం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలపై చంద్రబాబు మాట్లాడారు. వాటివల్ల ప్రజల సేవింగ్స్ పెరుగుతాయని తెలిపారు. ఎంఎస్ఎంఈ రంగం, ఇతర వ్యాపారవేత్తలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఏ దేశ తలసరి ఆదాయంలోనైనా ఆ దేశంలో నివసించే భారతీయులదే ఆధిపత్యం అని ప్రస్తుతం దుబాయ్ పర్యటనలో ఉన్న ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెంచేందుకు పలువురు వ్యాపారవేత్తలతో భేటీ అయ్యారు. వచ్చే నెలలో విశాఖపట్నంలో జరిగే సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానించారు. వచ్చే నెలలో ఆర్సెలార్‌మిత్తల్ నిప్పాన్ స్టీల్ ఎ÷-లాంట్‌కు ఆంధ్రాలో శంకుస్థాపన జరగనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, వ్యవసాయం, ఉద్యానరంగం, లాజిస్టిక్స్, రాజధాని నగరం అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. 750 వరకు సేవలను వాట్సప్ ద్వారా అందిస్తున్నామంటూ రియల్ టైమ్ గవర్నెన్స్ గురించి పేర్కొన్నారు. అలాగే తెలుగు కమ్యూనిటీ గురించి మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఒకరోజు ఈ గ్రహంపై అత్యంత ప్రభావవంతమైన సమాజంగా తెలుగు కమ్యూనిటీ నిలుస్తుందని, ఆ దిశగా ప్రణాళికలు చేస్తున్నామని వెల్లడించారు. గత 15 నెలల్లో తమ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు సేకరించిందని, మరో రూ.5లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

## 2025 అక్టోబర్ 26, ఆదివారం తెలుగు పంచాంగం




**మాసం - పక్షం**

కార్తీక మాసం

**శుక్ల పక్షం**

**తిథి**

షష్టి: అక్టోబర్ 25 రాత్రి 9:43 అక్టోబర్ 26 రాత్రి 10:03 వరకు

సప్తమి: అక్టోబర్ 26 రాత్రి 10:03

అక్టోబర్ 27 రాత్రి 10:32 వరకు

**నక్షత్రం**

పూర్వాషాఢ: అక్టోబర్ 25 రాత్రి 8:24 అక్టోబర్ 26 రాత్రి 8:18 వరకు

ఉత్తరాషాఢ: అక్టోబర్ 26 రాత్రి 8:18 అక్టోబర్ 27 రాత్రి 8:22 వరకు

**శుభ సమయాలు**

బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:48 - 5:32

అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:38 - 12:22

అమృతకాలం: సాయంత్రం 4:25 - 6:10

**అశుభ సమయాలు**

రాహుకాలం: సాయంత్రం 4:30 - 5:42

యమగండం: మధ్యాహ్నం 12:12 - 1:41

గుళికా: ఉదయం 3:00 - 4:30

దుర్ముహూర్తం: ఉదయం 7:42 - 8:30, మధ్యాహ్నం 4:01 - 4:49

వర్జ్యం: మధ్యాహ్నం 1:05 - 2:46

# పంచరామాల పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు

### షాద్‌నగర్ ఆర్టీసీ డిపో నుంచి నవంబర్ 2న యాత్ర ప్రారంభం




**షాద్‌నగర్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
షాద్‌నగర్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో భక్తుల కోసం పంచరామాల పుణ్యక్షేత్ర దర్శనానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేశారు. నవంబర్ 2వ తేదీ ఆదివారం సాయంత్రం 7 గంటలకు డిపో నుంచి యాత్ర ప్రారంభమవుతుంది. టికెట్ ధర 2300/-గా నిర్ణయించారు. ఈ పుణ్యయాత్రలో భాగంగా భక్తులు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట వంటి ప్రముఖ శైవక్షేత్రాలను దర్శించుకునే అవకాశం కలుగుతుంది. నవంబర్ 3 ఉదయం బ్రహ్మముహూర్తంలో అమరావతిలో పవిత్ర స్నానం అనంతరం శివాలయ దర్శనం జరిగేలా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. యాత్రకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 9959226287, 9182645281, 9440838985, 9491166785 నంబర్లలో సంప్రదించవచ్చు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ ఎం. ఉష సూచించారు.

# మాడ్గుల్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

### స్వచ్ఛత, రవాణా సౌలభ్యం కోసం మునిసిపాలిటీ చర్యలు



**ఆమనగల్లు, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మునిసిపాలిటీ పరిధిలోని మాడ్గుల్ రోడ్డులో ఉన్న అక్రమ నిర్మాణాలను మున్సిపాలిటీ అధికారులు తొలగించారు. పట్టణ శుభ్రత, రవాణా సౌలభ్యం, ప్రజల భద్రత దృష్ట్యా ఈ చర్యలు తీసుకోవడం జరిగింది అని జాతీయ రహదారిపై ఉన్న ఆక్రమణలను సంబంధిత వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించాలి అని మునిసిపల్ కమిషనర్ శంకర్ సూచించారు. స్వచ్ఛందంగా తొలగించని పక్షంలో, పోలీస్ మరియు ట్రాఫిక్ శాఖల సహకారంతో మునిసిపాలిటీ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ చర్యలకు ప్రజలు, వ్యాపారులు, సంబంధిత శాఖలు సహకరించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ చట్టం -2019 ప్రకారం, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

# తడిసిన వడ్లను ఆంక్షల లేకుండా కొనుగోలు చేయాలి

### హుస్నాబాద్ మార్కెట్‌లో బీజేపీ నాయకుల ఆందోళన



**హుస్నాబాద్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన వడ్లను పరిశీలించిన బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, రైతుల సమస్యలపై మార్కెట్ సూపర్‌వైజర్‌కు వినతిపత్రం అందజేశారు. తేమ శాతం పేరుతో వడ్లను కాంట వేయకుండా కాలక్షేపం చేస్తున్నారని, డ్రయర్ ఏర్పాటు చేసినా ఉపయోగించకపోవడం బాధాకరమన్నారు. శాశ్వత కార్యదర్శి లేకపోవడంతో రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. సన్న వడ్లు పండించిన రైతులకు బోనస్ హామీ ఇచ్చిన ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని, వడ్లను ఆంక్షల లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలని కోరారు. లేనిపక్షంలో బీజేపీ రైతుల పక్షాన పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వేముల దేవేందర్ రెడ్డి, తోట సమ్మయ్య, అనంతస్వామి, నాగార్జున్, వెంకటేష్, రాజేందర్ చారీ, నరేష్, రాజేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు ఎక్సైజ్ పరిధిలో వైన్‌షాపుల టెండర్లకు భారీ స్పందన

### 642 అప్లికేషన్లు దాఖలు
### సోమవారం మల్లికా కన్వెన్షన్‌లో లక్కీ డ్రా




**ఆమనగల్లు, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్ ఆమనగల్లు పరిధిలోని 17 వైన్ షాపుల టెండర్లకు ఈసారి అపూర్వమైన స్పందన లభించింది. 2025 -27 (రెండు సంవత్సరాల) కాలానికి టెండర్లు ఆహ్వానించగా, మొత్తం 642 అప్లికేషన్లు అందాయి. ఆమనగల్లు, కడ్తాల్, తల్లకొండపల్లి, మాడుగుల మండలాల్లోని షాపుల కోసం సెప్టెంబర్ 26 నుండి అక్టోబర్ 23 వరకు దరఖాస్తులు స్వీకరించారు. అప్లికేషన్ల ఎంపిక కోసం లక్కీ డ్రా కార్యక్రమం అక్టోబర్ 27, సోమవారం ఉదయం 9 గంటలకు శంషాబాద్ వద్ద ఉన్న మల్లికా కన్వెన్షన్‌లో నిర్వహించనున్నారు అని టెండర్ దాఖలు చేసిన అభ్యర్థులు తమ ఎంట్రీ పాస్‌తో సమయానికి హాజరుకావాలని అధికారులు సూచించారు. లక్కీ డ్రా నిర్వహణకు సంబంధించి పూర్తి ఏర్పాట్లు చేపట్టినట్లు ప్రొహిబిషన్ & ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బద్యానాత్ చౌహాన్ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్, ఆమనగల్లును సంప్రదించాలని సూచించారు.

# కరీంనగర్‌లో ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ నిరసన

### స్కాలర్షిప్ విడుదలకు డిమాండ్




**కరీంనగర్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎస్ఆర్ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల గేట్ వద్ద శనివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నగర కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని, ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థుల భవితవ్యంపై ప్రభావం పడుతోందన్నారు. ప్రైవేట్ కళాశాల యజమాన్యులతో చర్చలు జరిపినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఉత్తర తెలంగాణ ప్రాంతం నుండి విద్యార్థులు చదువుకుంటున్నారని, వారికి సరైన హాస్టల్ వసతి లేక ప్రభుత్వ హాస్టళ్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉందని, హాస్టల్లో సీట్లు, వసతులు తక్కువగా ఉన్నాయని తెలిపారు. కళాశాల అభివృద్ధికి, హాస్టల్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రద్ధ చూపాలని, నూతన భవనాల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎస్ఆర్ఆర్ కళాశాల విద్యార్థిగా ఎదిగిన ఘనతను గుర్తు చేస్తూ, ఆయన కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అర్చన, శ్రీలక్ష్మి, గన్నరపు రాకేష్, రాజు, రఘు, అభిలాష్, శ్రావణ్, శీను, రజనీకాంత్, అన్వేష్, రంజిత్, చరణ్, దుర్గా, రవితేజ, సన్నీ, ప్రభాకర్, విష్ణు, బద్రి తదితరులు పాల్గొన్నారు.


# కమీషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డిప్యూటీ కలెక్టర్ సందీప్



**కరీంనగర్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గ్రూప్ -1 ఫలితాల్లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన పాలకుర్తి సందీప్ కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం, ఐ.పి.ఎస్‌ను కమీషనర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సందీప్, కమీషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కమీషనర్ గౌష్ ఆలం ఆయనను అభినందించి, ప్రజలకు అంకితభావంతో సేవలందించాలని ఆకాంక్షించారు. సందీప్‌తో పాటు ఆయన తండ్రి, రిటైర్డ్ ఏ.సి.పి పాలకుర్తి కాశయ్య కూడా ఉన్నారు. కుమారుడిని అభినందించినందుకు కమీషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# షాద్ నగర్ టోల్ ప్లాజా వద్ద ట్రావెల్స్ బస్సులపై ఆర్టీఏ తనిఖీలు

### రెండు వాహనాలపై నిబంధనల ఉల్లంఘన కేసులు నమోదు




**షాద్ నగర్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ శివారులోని రాయికల్ టోల్ ప్లాజా వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని రెండు వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలు షాద్ నగర్ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ ఫరహాన్ ఆధ్వర్యంలో జరిగాయి. బస్సులలో అగ్నిమాపక పరికరాల లభ్యత, అనుమతి పత్రాల సమగ్రత, ప్రథమ చికిత్స సామగ్రి, ప్రయాణికుల లగేజీ వంటి అంశాలను అధికారులు కూలంకుషంగా పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కర్నూలు వద్ద ఇటీవల జరిగిన కావేరి ట్రావెల్స్ బస్సు దగ్ధం ఘటనను దృష్టిలో ఉంచుకుని, ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని మహమ్మద్ ఫరహాన్ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న-ఎస్సై మధుకర్



**ఎలిగేడు,**
**అక్టోబర్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆపదలో ఉన్నవారికి రక్త దానం చేయడం ద్వారా ప్రాణదాతలు అవుతారని ఎలిగేడు ఎస్సై మధుకర్ అన్నారు. అమరవీరుల వారోత్సవాల సందర్భంగా సుల్తానాబాద్ లో ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరంలో ఎలిగేడు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణం రక్తం అవసరం పడుతుందని అలాంటి సమయంలో రక్తదానం చేస్తే వారి ప్రాణాన్ని కాపాడిన వారు అవుతారని దీనికి ముఖ్యంగా యువత ముందుండాలని వారన్నారు. రక్తదానంలో పాల్గొన్న రక్తదాతలను కప్పల ప్రవీణ్ , పొన్నాల అనిల్ , సబ్బు శ్రీధర్, అడ్డగుంట ప్రదీప్ , వెంకటేష్, నాగేంద్ర సాయి , నంబయ్య, తిరుపతి, ఇస్తారి, మరికొందరు యువకులను ఎస్సై మధుకర్ అభినందించారు.

# మానవత్వం చాటుకున్న 2009 బ్యాచ్ ఎస్సైలు

### కిడ్నీ మార్పిడి చికిత్సకు రూ.5.14 లక్షల ఆర్థిక సహాయం



**హైదరాబాద్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హైదరాబాద్ పిసిఆర్‌లో విధులు నిర్వహిస్తున్న ఇన్స్పెక్టర్ ఎం. వరప్రసాద్ ఇటీవల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5,14,000/- ఆర్థిక సహాయాన్ని 2009 ఎస్సై బ్యాచ్ సంక్షేమ కమిటీ ప్రకటించింది. చెక్‌ను బ్యాచ్ సభ్యులు స్వయంగా ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, బగ్గని శ్రీనివాస్, జి. శ్రీనివాస్ వర్మ, ఎ. మధుసూధన్ రెడ్డి, జి.కె. ప్రసాద్ తదితరులు పరామర్శించారు. సహోద్యోగికి ఆపద సమయంలో చూపిన మద్దతు ఆదర్శనీయం అని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

# నాగుల చవితి పర్వదిన శుభాకాంక్షలు కుందూరు వెంకటరెడ్డి



**హాలియా, అక్టోబర్ 25**
నాగుల చవితి పర్వదినం సందర్భంగా అనుముల మండల ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసిన అనుముల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుందూరు వెంకటరెడ్డి. నాగుల చవితి హిందూ సంప్రదాయంలో విశిష్టమైన పండుగ ఈ రోజు మహిళలు నాగదేవతను పూజించి కుటుంబ సుఖశాంతులు, ఆరోగ్యం, సౌభాగ్యం కోరుకుంటారని పేర్కొన్నారు. ఈ నాగుల చవితి పండుగ ప్రతి ఇంట శాంతి, ఆనందం, సంపదలు చేకూరాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విద్యా బోధనకు యువ నాయకుడి ముందడుగు

## అల్వాల గ్రామ పాఠశాలలో ప్రొజెక్టర్ అందజేసిన కుప్పిరెడ్డి సాయికుమార్ రెడ్డి

**వనపర్తి, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: వనపర్తి జిల్లా యువజన అధ్యక్షుడు కుప్పిరెడ్డి సాయికుమార్ రెడ్డి తన సొంత ఖర్చుతో డిజిటల్ ప్రొజెక్టర్‌ను అల్వాల గ్రామ ప్రభుత్వ పాఠశాలకు అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల స్థాయిలో విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలలోనూ అందించాలన్న సంకల్పంతో ఈ చర్య చేపట్టినట్లు తెలిపారు. పిల్లలు ఆధునిక సాంకేతికత ద్వారా విజువల్ పద్ధతిలో నేర్చుకుంటే త్వరగా అర్థం చేసుకుంటారని, డిజిటల్ బోధనతో వారి ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు.



పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయం ఎల్లప్పుడూ అందిస్తానని ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మంజులత, పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను గుర్తించి, మరొక ఉపాధ్యాయుని నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్ రమాదేవి, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు లక్ష్మీకాంత్ రెడ్డి, అజిగర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల వారోత్సవాల్లో 20 కి.మీ సైకిల్ ర్యాలీ

### కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ



**కరీంనగర్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో 20 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీని శనివారం నిర్వహించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి కమీషనర్ గౌష్ ఆలం జెండా ఊపి ప్రారంభించిన ఈ ర్యాలీలో రన్నర్స్, సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు, డాక్టర్లు పాల్గొన్నారు. బస్ స్టేషన్, గీతాభవన్, మంకమ్మతోట, శివ థియేటర్, ఎలక్ట్రిసిటీ కార్యాలయం, కోర్ట్ చౌరస్తా, గాంధీ చౌరస్తా, కమాన్ చౌరస్తా మీదుగా సాగిన ర్యాలీ తిరిగి పరేడ్ గ్రౌండ్ వద్ద ముగిసింది. అనంతరం సీపీ మెడల్స్ అందజేశారు. అక్టోబర్ 31 వరకు అమరవీరుల వారోత్సవాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమీషనర్ తెలిపారు. విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు, ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు, విద్యాసంస్థల ప్రతినిధులు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



**ఆమనగల్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: తెలంగాణ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, వారి సొంతింటి కలను సాకారం చేస్తోంది అని మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీ ఇందిరమ్మ కమిటీ సభ్యులు విజయ్ రాథోడ్, హరిలాల్ తెలిపారు. శనివారం అమనగల్లు మండలంలోని మేడిగడ్డ తాండలో ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పత్య. సురేష్, రమేష్, సునీత, మురళి, పాండు తదితరులు పాల్గొన్నారు.

# అంకితభావ సేవలకు చిరస్థాయి గుర్తింపు

### కెఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షులు మెకానిక్ బాబా



**ఆమనగల్లు, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: విధి నిర్వహణలో అంకితభావం ప్రదర్శించిన వారు సమాజంలో చిరస్థాయిగా కీర్తింపబడతారని కెఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షులు మెకానిక్ బాబా పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం లభించే విశ్రాంత సమయాన్ని సమాజ శ్రేయస్సు కోసం వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఆమనగల్లు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించిన ఎం.పి.హెచ్.ఈ.ఓ. అధికారి రవికుమార్ శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు. డ్రాయింగ్ ఆఫీసర్ డాక్టర్ మైమున, ఇతర అధికారులు రవికుమార్‌ను శాలువాతో సత్కరించి, ఆయన చేసిన సేవలను ప్రశంసించారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం

**సిద్దిపేట, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా అక్టోబర్ 27 మరియు 28 తేదీల్లో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ ఎస్.యం. విజయ్ కుమార్, ఐపీఎస్., ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజుల పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది గ్రామాలను సందర్శించి, గ్రామస్తుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటారు. పరిష్కరించగలిగిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలు ఉంటే, సంబంధిత శాఖలకు నివేదించి పరిష్కారానికి కృషి చేస్తారు. ఈ అవకాశాన్ని సిద్దిపేట జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారులకు తెలియజేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ, వారి అభ్యున్నతికి పోలీస్ శాఖ కృషి చేస్తుందని ఆయన తెలిపారు.



# ఎంపీ నిధులతో బోరుబావి ప్రారంభం

### శంకరపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి చేతుల మీదుగా ప్రారంభం



**శంకరపట్నం, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
శంకరపట్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ చొరవతో ఎంపీ నిధుల ద్వారా ఏర్పాటు చేసిన బోరుబావిని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని బోర్ వేయించారని, ఇందుకు బండి సంజయ్ కుమార్‌కు మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, నాయకులు జంగ జైపాల్, దాసరపు నరేందర్, కొయ్యడ అశోక్, రాసమల శ్రీనివాస్, బిజిలి సారయ్య, కనకం సాగర్, పడాల వెంకటలక్ష్మి, బొజ్జ సాయి ప్రకాష్, గూళ్ల రాజు, తోట అనిల్, పంజాల అనిల్, గొల్లిపెల్లి వెంకటేశం, నర్సయ్య, తాడవేణి రవి, సంపత్, సుపర్వేజర్ అనిల్, ఏ.ఎన్.ఎం. శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

# జాగృతిలో మనకోండూర్ బీసీ నాయకుల చేరిక

**మనకోండూర్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: కరీంనగర్ జాగృతి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మనకోండూర్ మండలానికి చెందిన బీసీ నాయకులు విడపు ఉగేందర్, బానాల కుమారస్వామి, వెల్ది రాజశేఖర్, వంగల కుమారస్వామి తదితరులు వంగల లింగచారి ఆధ్వర్యంలో జాగృతిలో చేరారు. వారికి జిల్లా జాగృతి అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ జాగృతి కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా బీసీల ఐక్యత కోసం కవితక్క కృషి చేస్తున్నారని, రెండు జాతీయ పార్టీలు బీసీలకు మోసం చేశాయని విమర్శించారు. నలబై రెండు శాతం రిజర్వేషన్ అమలుపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, బిల్లు, ఆర్డినెన్స్, జీవో ఇచ్చినా కాంగ్రెస్ నేతలతో కోర్టులో కేసులు వేయించిన విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఈ మోసాన్ని తెలంగాణ జాగృతి ఊరూరా ప్రచారం చేస్తుందని పేర్కొన్నారు. బీజేపీకి అవకాశం ఉన్నప్పటికీ బీసీలను పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల తిరుపతి, నాయకులు గాలిపల్లి రత్నాకర్, అపర్ణ మంజు భార్గవి, గర్షకుర్తి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యేపై రెచ్చగొట్టే వీడియో

### - కేసు నమోదు

**ఆమనగల్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్**
: కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి పై అభ్యంతరకర వ్యాఖ్యలతో కూడిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఘటనపై పోలీస్ శాఖ స్పందించింది. "ఎమ్మెల్యే గారు మా బాకీ ఎప్పుడు తీరుస్తారో?" అంటూ రెచ్చగొట్టే విధంగా కోట్ల సాయిబాబా అనే వ్యక్తి జనం మనం అనే వాట్సాప్ గ్రూపులో వీడియోను పోస్ట్ చేసినట్లు ఫిర్యాదు అందింది. ఈ మేరకు మెడిగడ్డ తండాకు చెందిన హరి లాల్ నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై స్పందించిన ఎస్ఐ బి. వెంకటేష్, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా వీడియోలు, వ్యాఖ్యలు పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు సామాజిక మాధ్యమాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, చట్టాన్ని ఉల్లంఘించే చర్యలకు పాల్పడితే తగిన శిక్షలు విధించబడతాయని ఆయన స్పష్టం చేశారు.

# మౌలిక వసతులకు ప్రాధాన్యత

### దానగాళ్ల యాదగిరి



**బోడుప్పల్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బోడుప్పల్ 13వ డివిజన్‌లో డబుల్ బెడ్ రూమ్ బ్లాకులకు రేలింగ్ పనులు ప్రారంభం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్‌లోని డబుల్ బెడ్ రూమ్ ఏ, బీ, సీ బ్లాకుల మెట్లకు రేలింగ్ పనులను శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దానగాళ్ల యాదగిరి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నా డివిజన్‌లో మౌలిక వసతులకు మొదటి నుంచీ ప్రాధాన్యత ఇస్తున్నాను. వృద్ధులు, దివ్యాంగులు భవనాలపైకి ఎక్కేందుకు ఇబ్బంది పడుతున్నారని గుర్తించి, మున్సిపల్ కమిషనర్ శైలజ గారికి తెలియజేశాను. ఆమె వెంటనే స్పందించి రేలింగ్, షెడ్లు, ప్రహరీ గోడ వంటి పనులకు శ్రీకారం చుట్టారు" అని తెలిపారు. డివిజన్ ప్రజల తరపున కమిషనర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్ రూమ్ అధ్యక్షులు చిప్పల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి తుక్కోజీ అమరేందర్, గౌరవ అధ్యక్షులు అన్నందాసు బిక్షపతి, జాయింట్ సెక్రటరీ షఫీరుదీన్, సలహాదారులు గుండ్ల కుమారస్వామి, సతీష్ కుమార్, శ్రీరాములు, బ్లాక్ ఇంచార్జ్ గొరిగే సంతోష్ కుమార్, నాగేంద్ర, మహిళా లబ్దిదారులు ఎదుల రేణుక, పల్లె మంగమ్మ, చిప్పల రజిని, దేవాలక్ష్మి, కోకిల రాణి, బాలమణి, మమత, రమణ, ఉపాలమ్మ, జయమ్మ, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



# గోరక్షకుడిపై దాడికి నిరసనగా ధర్నా

### షాద్‌నగర్ చౌరస్తాలో బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆందోళన



**షాద్‌నగర్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: షాద్‌నగర్ పట్టణ కేంద్రంలోని చౌరస్తాలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. గోరక్షణ కోసం వెళ్లిన బజరంగ్ దళ్ కార్యకర్తపై ఎంఐఎం గుండాలు తుపాకీతో దాడి చేసిన ఘటనను నిరసిస్తూ ఈ ధర్నా చేపట్టారు. అనంతరం ఎంఐఎం గుండాల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పెద్దలు, బజరంగ్ దళ్ కార్యకర్తలు, వివిధ ప్రాంతాల నాయకులు పాల్గొన్నారు. దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మండల రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు.

## ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యేను ఆహ్వానించిన పూర్వ విద్యార్థులు.

**ఎలిగేడు, అక్టోబర్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నేడు సుల్తానాబాద్ విజయ గార్డెన్లో జరిగే 1975 -76 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనానికి హాజరుకావాలని మరియు సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో స్టేజ్ పై మా బ్యాచ్ గుర్తుగా నిర్మించిన రేకుల షెడ్డులు మీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయాలని పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు ను శివపల్లి లోని ఆయన గృహంలో మర్యాదపూర్వకంగా కలసి పూర్వ విద్యార్థులు కందుకూరి ప్రకాష్ రావు (పెద్దన్న) డాక్టర్ దూడ మధుకర్, కమలాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి కాసింతో పాటు పలువురు ఆహ్వానించారు.



# ఉపాధిహామీ గ్రామ సభను అడ్డుకున్న గ్రామస్థులు

**మనోహరాబాద్ గ్రామ పంచాయతీలో సభ రద్దు**



**మనోహరాబాద్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉపాధిహామీ గ్రామ సభను గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. గ్రామంలో వీధి దీపాలు, తాగు నీటి సమస్యలు తదితర అంశాలను పట్టించుకోకపోవడంపై మండిపడ్డ వారు, గ్రామ పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యాన్ని విమర్శించారు.గ్రామ సమస్యలపై సమగ్ర చర్చ జరగాలంటే అన్ని శాఖల అధికారులు, ముఖ్యంగా గ్రామ ప్రత్యేక అధికారి హాజరుకావాలని ప్రజలు డిమాండ్ చేశారు. దీంతో అధికారులు సభను రద్దు చేసి, త్వరలో మళ్లీ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొట్టేళ్ల వెంకట్ గౌడ్, జావేద్ పాషా, వెంకట్ రెడ్డి, నవీన్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ యాదవ్, యువకులు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కేశ మల్ల రామస్వామి మృతి బాధాకరం

**బహుజన మేధావి డాక్టర్ యేకుల రాజారావు .**



**దేవరకొండ అక్టోబర్ 25. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ నియోజకవర్గం గుండ్లపల్లి మండలం గోన బోయినపల్లి గ్రామానికి చెందిన కేశమల్ల రామస్వామి ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ మరణించిన విషయం తెలుసుకొని శనివారం బహుజన మేధావి పూలే అనుచరుడు అంబేద్క రిస్ట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ యేకుల రాజారావు, మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బోయిని చంద్రమౌళి,కేశమల్ల రామస్వామి అకాల మరణం బాధాకరమన్నారు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు వారితో పాటు ప్రధాన కార్యదర్శి మెడ సైదులు, మాల మహానాడు గుండ్లపల్లి అధ్యక్షులు నారి మల్ల మల్లేష్ మలమహానాడు నాయకులు బాలకృష్ణ, రామకృష్ణ, చెన్నయ్య , చేపూరి మురళి, బయ్య శ్రీను, మనోహర్, గోరటి ముఖేష్, గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.

# విద్యా వ్యవస్థకు కేసీఆర్ చేసింది సున్నా

**ఎమ్మెల్యే బాలు నాయక్ .**





**దేవరకొండ అక్టోబర్ 25. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ మండలంలోని ముదిగొండ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో మరమ్మత్తుల పనులను ఎమ్మెల్యే బాలు నాయక్, అధికారులు , స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చశారు. ఈఐ నిధుల నుంచి మంజూరు అయిన 26.85 లక్షల రూపాయల వ్యయంతో మరమ్మత్తు పనులను శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మండల ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అవడం దేవరకొండకు గర్వ కారణం

## ఆర్ కే.సేవా ఫౌండేషన్.



**దేవరకొండ అక్టోబర్ 25. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**ఇటీవల జరిగిన ఎస్ జి ఎఫ్ అండర్ -14 బాలికల విభాగంలో దేవరకొండ నుండి కబడ్డీ మాస్టర్ చరణ్ ఆధ్వర్యంలో పఠాన్ చెరువు లో జరిగిన కబడ్డీ పోటీలకు వెళ్లిన ప్లేయర్స్ లో జాతీయ స్థాయి లో రాష్టం నుండి ఇద్దరు ఎంపిక అవడం అందులో మన దేవరకొండ నుండి వి. ఉదీపాన ఎంపిక అవ్వడం మనకు ఎంతో గర్వ కారణం అని ఆర్ కే సేవా ఫౌండేషన్ అధ్యక్షులు పున్న రామకృష్ణ కొనియాడారు. ఈ సందర్భంగా త్వరలో గుజరాత్ లో జరిగే పోటీలకు మా వంతు సహాయం అందిస్తామని తెలిపారు. కోచ్ చరణ్ వారి పట్ల శ్రద్ధ,వారిలో నైపుణ్యం పెంపోంధించి జాతీయ స్థాయి లో ఎంపిక అయ్యేలా ప్రోత్సహించిన తీరు అభినందనియం అని సీనియర్ జర్నలిస్ట్ ముసిని అంజి తెలిపారు. అనంతరం క్రీడాకారులను ఫౌండేషన్ సభ్యులు సన్మానం చేసి జ్ఞాపికను ప్రదానం చేసారు. కోచ్ చరణ్ మాట్లాడుతూ వారికీ సహకరించినందుకు ధన్యవాదములు తెలుపుతూ జాతీయ స్థాయి లో ఎంపికైన ఉదీపాన కు చేయూత, సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఫౌండేషన్ ఉప అధ్యక్షులు కరాటే మాస్టర్ శ్రీను, ఎండీ అన్వార్, జనరల్ సెక్రటరీ పొట్ట విజయ్ కుమార్, డాన్స్ మాస్టర్ జగన్,శరత్, గుండాల వెంకట్ యాదవ్,కొండ ప్రేమ్ కుమార్, టీ. ప్రతాప్,ఆకాష్,జగన్, కిరణ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఉల్పర వాగు వద్ద దెబ్బతిన్న రోడ్డును పరిశీలించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

**బ్రిడ్జ్ పనుల ఆలస్యం పై ఆగ్రహం వ్యక్తం**



**వంగూర్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంగూర్ మండలంలోని ఉల్పన గ్రామం వద్ద ఉన్న ఉల్పర వాగు వద్ద దెబ్బతిన్న రోడ్డును శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వేముల నరేందర్ రావు పరిశీలించారు. గత సంవత్సరం మంజూరైన హై లెవెల్ బ్రిడ్జ్ పనులు ఇప్పటివరకు ప్రారంభం కాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన నరేందర్ రావు, వర్క్ డిజైన్ డ్రాయింగ్ ఇంకా అందలేదని సమాధానం విన్నారు. టెండర్ పిలిచి డ్రాయింగ్ ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు బ్రిడ్జ్‌పై పట్టించుకోకపోయినా, మట్టి పోసి ఇసుక దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ వారం లోపల మోల్గార నుండి కల్వకుర్తి వరకు డబుల్ రోడ్డు డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు గున్నా ఆనందరెడ్డి తెలిపారు. ప్రభుత్వ పనులు ప్రారంభించే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాగి రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు శివ, గ్రామస్తులు అంజి, లింగమయ్య, శేఖర్, బాలు, శ్రీకాంత్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 6న మల్టీ స్పెషాలిటీ మెడికల్ క్యాంపు

**అచ్చంపేట ఏరియా హాస్పిటల్‌లో ఉచిత వైద్య సేవలు**



**అచ్చంపేట, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అచ్చంపేట పట్టణ కేంద్రంలోని ఏరియా హాస్పిటల్‌లో నవంబర్ 6న ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు మల్టీ స్పెషాలిటీ మెడికల్ క్యాంపు నిర్వహించనున్నారు. మహబూబ్ నగర్ ఎస్వీఎస్ మెడికల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో, సీబీఎం ట్రస్ట్ సహకారంతో ఈ క్యాంపు ఏర్పాటు కానుంది. అన్ని రకాల వ్యాధులకు సంబంధించి నిపుణులు ఈ క్యాంపులో పాల్గొననున్నారు. అచ్చంపేట నల్లమల పర్సనల్ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ విలేకరుల సమావేశంలో సూచించారు.

# ఆగమయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన కేంద్రమంత్రి

**అందెల శ్రీరాములు కుటుంబాన్ని పరామర్శించిన కిషన్ రెడ్డి**



**సరూర్‌నగర్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం సరూర్‌నగర్ మండల కేంద్రానికి చెందిన బీజేపీ ఇంచార్జ్, స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ అందెల శ్రీరాములు తండ్రి అందెల ఆగమయ్య ఇటీవల పరమపదించారని తెలిసి కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి ఆయన నివాసానికి చేరుకున్నారు. ఆగమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన అనంతరం, శ్రీరాములు కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని అందించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్య గౌడ్, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కార్పొరేషన్ బీజేపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

# దళితుల ఆత్మగౌరవ మహా ర్యాలీ విజయవంతం చేయాలి

**వెల్దండలో ఎమ్మార్పీఎస్ సమావేశం**



**వెల్దండ, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నవంబర్ 1న "చలో హైదరాబాద్" దళితుల ఆత్మగౌరవ మహా ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ వెల్దండ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ మంగళగిరి శ్రీను మాదిగ అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గుడిగానిపల్లి రాజు మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయి మీద బూటుతో దాడి చేయడం రాజ్యాంగం మీద, దళితుల ఆత్మగౌరవం మీద దాడిగా అభివర్ణించారు. దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోకపోవడం, ఢిల్లీ పోలీస్ వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, మానవ హక్కుల కమిషన్ విఫలమయ్యాయని విమర్శించారు. రాజకీయ, ప్రజా సంఘాల దళితులు మహా ర్యాలీలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బల్లె జగన్, అనుగుల జంగయ్య, జంగిలి నిరంజన్, మంగళగిరి సత్యం, ట్యాటు రమేష్ మాదిగ, పెద్దయ్య మాదిగ, అంజయ్య, నవీన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నేతృత్వంలో జూబ్లీహిల్స్‌లో విస్తృత ప్రచారం



**జూబ్లీహిల్స్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జూబ్లీహిల్స్ గల్లీలో పుట్టి పెరిగిన యువకుడికి అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు. నవీన్ గెలుపు నియోజకవర్గ అభివృద్ధికి మలుపు అవుతుందని, కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీజేపీకి బీ టీమ్‌గా బీఆర్ఎస్ పనిచేస్తోందని, ప్రజాస్పందనను చూసి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలుస్తారని ఎమ్మెల్యే నారాయణరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ప్రజాస్పందనను తట్టుకోలేక బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ అబద్ధాలపై ఆధారపడి ఎన్నికల బరిలో దిగిందని, ఓటమి తథ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న శ్రీశైలం యాదవ్, జిల్లెల్ల రాములు, కాయి తి విజయకుమార్ రెడ్డి, బృంగి ఆనంద్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, రాహుల్, దున్న భాస్కర్, జంగయ్య గౌడ్, మట్ట వెంకటయ్య గౌడ్, మట్ట భరత్, పురుషోత్తం, ఎండి రషీద్, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభపై మాజీ వైస్ ఎంపీపీ వీరస్వామి గౌడ్ ఆగ్రహం



**ఎలిగేడు, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్రామ ప్రజలు, సంబంధిత అధికారులు లేకుండా గ్రామ సభ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నిస్తూ, మాజీ వైస్ ఎంపీపీ బుర్ర వీరస్వామి గౌడ్ శనివారం పంచాయతీ కార్యదర్శి అంజలిని నిలదీశారు. రోడ్డు విస్తరణలో భాగంగా స్థలాలు, ఇళ్లను కోల్పోయే బాధితుల కోసం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు, బాధితులు మాత్రమే హాజరయ్యారు.ఈ సందర్భంగా వీరస్వామి గౌడ్ మాట్లాడుతూ, గ్రామ సభ అనేది ప్రజలతో, అధికారులతో బహిరంగంగా నిర్వహించాల్సినదని, చాటింపు లేకుండా, ప్రత్యేక అధికారి లేకుండా, కార్యాలయ గదిలో నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థుల సమక్షంలో మరోసారి బహిరంగంగా గ్రామ సభ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యే మేఘారెడ్డి చేత గంగవరంకు ఘనసన్మానం

## కవిత్వం ప్రజాప్రతినిధులకు ఇంధనం లాంటిది - మేఘారెడ్డి





**వనపర్తి, అక్టోబర్ 25( నీలగిరి ఎక్స్ ప్రెస్):** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సీనియర్ జర్నలిస్టు,కవి గంగవరం రామకృష్ణారెడ్డిని శనివారం ఘనంగా సన్మానించారు. రామకృష్ణారెడ్డి రాసిన "తూడి మేఘమై కురిసె వనపర్తి" అనే కవితను ఫ్రేమ్ రూపంలో అందించగా, ఆ కవితను చదివిన మేఘారెడ్డి రామకృష్ణారెడ్డిని స్వయంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మేఘారెడ్డి మాట్లాడుతూ, "రామకృష్ణారెడ్డి లాంటి నూతన కవులు రాసే కవిత్వాలు కానీ వార్తలు కానీ అధికారంలో ఉన్న ప్రభుత్వాలు, ప్రతిపక్ష పార్టీలకు, ప్రజాప్రతినిధులకు ఒక ఫ్యూయల్ (ఇంధనం) లా పనిచేస్తాయి" అన్నారు. "రామకృష్ణారెడ్డి ఒక ఉపాధ్యాయుడిగా, రిపోర్టర్‌గా, సోషలిస్టుగా తన భావాలను సమాజం ముందుకు తెస్తూ ఉంటాడు. ఈరోజు నా విజయంపై తన అభిప్రాయాన్ని కవిత రూపంలో వ్యక్తం చేయడం నాకు ఆనందంగా ఉంది," అని ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై రాయండి" ఆయన అడిగారు, దీనికి ప్రతిగా రామకృష్ణారెడ్డి రాసిన "రేవంతు నువ్వు" అనే కవితను ఫోటో ఫ్రేమ్ రూపంలో చూపించగా, ఎమ్మెల్యేమేఘారెడ్డి ఆ కవితను ప్రశంసించారు. "ముఖ్యమంత్రి జీవితాన్ని ప్రతిబింబించే ఈ కవిత వనపర్తి విజయానికి ప్రేరణ. ముఖ్యమంత్రి సమయం దొరికిన వెంటనే ఈ కవితను స్వయంగా బహుకరించేలా చూస్తాను" అని మేఘారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో టి డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంబటి స్వామి, జిల్లా కోశాధికారి పవన్ కుమార్,పట్టణ అధ్యక్షులు శేఖర్, ప్రధాన కార్యదర్శి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# కళాకారులకు పుట్టినిల్లు వనపర్తి

**వనపర్తి,అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):** వనపర్తి కళాకారులకు పుట్టినిల్లు అని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. శనివారం సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో ఆర్ డి ఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ప్రపంచ కళాకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ అనాదిగా కళలను కళాకారులను సముచిత రీతిలో ఆదరించి గౌరవించిన సంప్రదాయం వనపర్తి జిల్లాలో ఉందని ఆ వారసత్వాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నందుకు ఆనందంగా ఉందని పేర్కొన్నారు. వివిధ రంగాలలో ప్రతిభ గల కళాకారులను రానున్న కాలంలో ఒక వేదికపైకి తీసుకు వస్తామని వారిని ఇప్పటి తరానికి పరిచయం చేసే కార్యక్రమాన్ని చేపడతామని శంకర్ గౌడ్ వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులైన వల్లభాపురం



శ్రీనివాస్,గుడిసె శివలింగం, చీర్ల నాగేంద్రం సాగర్,ఉండేకోటి కృష్ణయ్య,మీసాల రాము,డప్పు సువర్ణ,మల్లెపు రాధ,నందిమల్ల నాగరాజు,మొగిలి రామక్రిష్ణ తదితరులను శాలువా జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈనాటి కార్యక్రమంలో ఆర్డిఎస్ సంస్థ నిర్వాహకులు చిన్నమ్మ థామస్,బైరోజు చంద్ర శేఖర్,సత్తార్,గంధం నాగరాజు, బండారు శ్రీనివాస్,డప్పు స్వామి,శాంతన్న,వెంకటస్వామి, విష్ణువర్ధన్ గౌడ్,శ్రీలక్ష్మీ,కవిత, కల్పన, బాలేమయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో వెల్దండ కాంగ్రెస్ నాయకుల ప్రచారం

## నవీన్ యాదవ్ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం



**వెల్దండ, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ తరఫున వెల్దండ మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటి తిరిగి ప్రజలకు నవీన్ యాదవ్‌కు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధికి నవీన్ గెలుపు కీలకమని, అధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మండల కాంగ్రెస్ నాయకులు, సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, మండల యూత్ అధ్యక్షులు మట్ట భరత్ గౌడ్, పురుషోత్తం, ఎండి రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# దయనీయ స్థితిలో ప్రభుత్వ ఆసుపత్రులు

## ఎంజీఎం ఆసుపత్రిలో ఇద్దరు చిన్నారులకు ఒకే ఆక్సిజన్ సిలిండర్



**వరంగల్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** వరంగల్ జిల్లా కేంద్రంలోని ఎంజీఎం ఆసుపత్రిలో శనివారం చోటుచేసుకున్న ఘటన ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. ఇద్దరు పసిపిల్లలకు ఒకే ఆక్సిజన్ సిలిండర్‌ను అమర్చిన వైద్య సిబ్బంది, పరీక్షలకు తరలించేందుకు కేర్ టేకర్లు లేకపోవడంతో కుటుంబ సభ్యులే స్వయంగా పిల్లలను ఆక్సిజన్ సిలిండర్‌తో కలిసి తరలించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండగా, ఆసుపత్రిలో సౌకర్యాల కొరత, సిబ్బంది నిర్లక్ష్యం వంటి అంశాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# శాతవాహనలో కె. విద్యా సాగర్‌కు డాక్టరేట్

## బీఫార్మసీలో తక్షణ ప్రవేశాలు



**కరీంనగర్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** శాతవాహన విశ్వవిద్యాలయంలోని కళలు, సామాజికశాస్త్ర కళాశాల అర్థశాస్త్ర విభాగంలో పరిశోధక విద్యార్థి కె. విద్యా సాగర్‌కు డాక్టరేట్ డిగ్రీ (పరిశోధక పట్టా) అందజేశారు. "పాట్టన్ ఆఫ్ హౌస్‌హోల్డ్ ఎక్స్పెండిచర్ ఆన్ ఎడ్యుకేషన్: ఏ స్టడీ ఇన్ తెలంగాణ స్టేట్" అనే అంశంపై విభాగాధిపతి డా. కోడూరి శ్రీవాణి పర్యవేక్షణలో పరిశోధన చేసి, బహిరంగ మౌఖిక పరీక్షలో అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థి, బి.ఓ.ఎస్ ఆచార్య ఎం. వర ప్రసాద్, ఉపకులపతి, రిజిస్ట్రార్ జాస్తి రవి కుమార్, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక శాతవాహన విశ్వవిద్యాలయం ఎంఎల్డీ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 27న ఉదయం 10 గంటలకు తక్షణ ప్రవేశాలు (స్పాట్ అడ్మిషన్లు) నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డా. కె. శ్రీశైలం తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ మార్కుల షీట్, వెబ్సైట్ ర్యాంక్ కార్డు, ఇతర అవసరమైన వర్జినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. తక్షణ ప్రవేశం పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ అర్హత ఉండదని, రూ. 31,000 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

# జనంబాటలో జాగృతి జిల్లా నేతలు

## నిజామాబాద్ జిల్లాలో జాగృతి కార్యక్రమం ప్రారంభం



**నిజామాబాద్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** సామాజిక తెలంగాణ, సమాన న్యాయం కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రారంభించిన "జాగృతి జనం బాట" కార్యక్రమంలో భాగంగా, మొదటి రోజు నిజామాబాదు జిల్లాలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోల శ్రీనివాస్, కార్యదర్శి అర్చన సేనపతి, మైనారిటీ అధ్యక్షుడు ముస్తఫా, రామ్ కోటి, సోషల్ మీడియా కన్వీనర్ వర్ష, మహిళా అధ్యక్షురాలు బండారి లావణ్య, విద్యార్థి విభాగం రాము యాదవ్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాండురంగా రెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారులకు ఊపిరిగా, బడుగులకు బాసటగా, ఆదివాసులకు అండగా, నిరుద్యోగులకు మద్దతుగా, సామాజిక న్యాయం లక్ష్యంగా జాగృతి జనం బాట కొనసాగుతోందన్నారు. ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కలిగించడం ప్రధాన ఉద్దేశ్యమని, మేధావులతో చర్చలు జరిపి ప్రజలతో మమేకమయ్యే ఈ కార్యక్రమం తెలంగాణకు నూతన దిశను చూపుతుందని పేర్కొన్నారు.

# కబ్జాకు గురైన నక్షబాటను ఇప్పించాలి

## కందుకూరు ఎమ్మార్వో, ఆర్డీవోలకు గ్రామస్తుల వినతి





**కందుకూరు, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండల కేంద్రానికి చెందిన బాచుపల్లి గ్రామం మీదుగా వయా పెరుగూడ నుంచి కొత్తగూడ వరకు ఉన్న నక్షబాటను మద్దుల లక్ష్మారెడ్డి కోల్టిఫారం కబ్జా చేశారని ఆరోపిస్తూ, గ్రామస్తులు శనివారం ఎమ్మార్వో, ఆర్డీవోలకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, నక్షబాట ఏ సై నంబరులో ఉందో గుర్తించి, ఏడి సర్వేకు పంపించి నక్షబాటు ఉన్నట్లు తేలితే తప్పకుండా తిరిగి ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మార్వో కూడా స్పందిస్తూ, ఆరైన్ మరియు ప్రభుత్వ సర్వే ద్వారా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి గ్రామ ప్రజలు, మాజీ ఎంపీటీసీ గుండాల సురేష్, కొంతం అంజి రెడ్డి, మద్దెల శ్రీశైలం, ఎగిరిశెట్టి నరేష్, ఎగిరిశెట్టి రాజు, శేఖర్ గుప్తా, కృష్ణ యాదవ్, మధ్యల రమేష్, మద్దెల రవి, మద్దెల అశోక్, పెద్దిగాని చెన్నయ్య, ఆనిగొని యాదగిరి గౌడ్, మధుసూదన్ రెడ్డి, ఎగిరిశెట్టి అనంత్, ఇటమోని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# భరోసా సేవా సంస్థ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ

## అందుల పాఠశాలలో విద్యార్థులకు ఉచిత దుస్తులు, పండ్ల పంపిణీ





**కరీంనగర్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కరీంనగర్ పట్టణంలోని అందుల పాఠశాలలో శుక్రవారం భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దుస్తులు మరియు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బిర్లా ఓపెన్ మైండ్స్ డైరెక్టర్ దాసరి ప్రశాంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భరోసా సంస్థ అధ్యక్షులు అక్కినపల్లి నాగరాజు, సభ్యులు కంకటి అనూప్, కంకటి సృజన్, అరుణ్, రేవిక్, పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.

# కలాభారతిలో డాన్స్ అకాడమీ 25వ వార్షికోత్సవం



**కరీంనగర్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** నగరపాలక సంస్థ కళాభారతిలో ఏర్పాటు చేసిన సన్షైన్ డాన్స్ అకాడమీ 25వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు ఘనంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు, మాజీ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ పాల్గొని విద్యార్థులను అభినందించారు. కళా ప్రదర్శనలతో కళాభారతి ప్రాంగణం కళాకళలాడింది.

# రాష్ట్ర హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ

### రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బుర్ర శ్రీనివాస్ గౌడ్



**హుస్నాబాద్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** : హుస్నాబాద్ పట్టణంలో శనివారం గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన బుర్ర శ్రీనివాస్ గౌడ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తనను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బుర్ర ఎంకన్న గౌడ్, పాకాల శ్యాంసుందర్ గౌడ్, బుర్ర జగన్ గౌడ్, బొమ్మగాని సదానందం గౌడ్, పూదరి రామన్న, పున్న చందు, బొడ్డు శ్రీనివాస్, బత్తుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలవికాస ఆధ్వర్యంలో అనాధల, వృద్ధుల ఆదరణ దినోత్సవం

### హుస్నాబాద్‌లో సేవా కార్యక్రమం



**హుస్నాబాద్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం బాలవికాస జనవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అనాధల, వృద్ధుల ఆదరణ దినోత్సవాన్ని నిర్వహించారు. దాతల చేయూతతో 32 మంది అనాధలు, వికలాంగులకు నిత్యావసర వస్తువులు, బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూఈ సమాజంలో బంధాలు, బంధుత్వాలు మరిచి అనాధలుగా వదిలేస్తున్న పరిస్థితుల్లో, బాలవికాస సంస్థ ఆదర్శంగా నిలుస్తూ, మన్ననలు పొందుతూ విజయబాటలో ముందుకు సాగుతోందన్నారు. వికలాంగులు, వృద్ధులు సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ పురపాలక సంఘ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, మాజీ వైస్ చైర్మన్ అనిత రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయురాలు సంధ్యావాలి, నాయకులు గంపల శ్రీనివాస్, బత్తుల శ్రీనివాస్, గొర్ల అయిలేష్ యాదవ్, బాలవికాస సెంటర్ మేనేజర్ పిల్లి జ్యోతి, నిర్మల, శ్రీమతి వృద్ధులు, వికలాంగులు, అనాధలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 27న ఎ4 మద్యం దుకాణాల కేటాయింపు

**మంచిర్యాల, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలం శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ సమీపంలోని పి.వి.ఆర్. గార్డెన్స్‌లో ఈ నెల 27వ తేదీన ఉదయం 10 గంటలకు ఎ4 మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ నిర్వహించనున్నట్లు జిల్లా ఆబ్కారీ, మద్య నిషేధశాఖ అధికారి నందగోపాల్ తెలిపారు. 2025 -27 నూతన మద్యం పాలసీ విధానంలో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు లేదా అధికృత ప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

### అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం సందర్భంగా కళాకారులకు వలస సుభాష్ చంద్రబోస్ శుభాకాంక్షలు



**కోహెడ, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కూరెళ్ల గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకులు, గిటారి కళాకారులు, రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి సిల్వర్ గోల్డ్ అవార్డు గ్రహీత వలస సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ కళాకారుల దినోత్సవాన్ని శనివారం హైదరాబాద్‌లో తన సంగీత గురువు గిటార్ రావుతో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంగీతం మానసిక ప్రశాంతతకు మార్గం అని, నేటి యువత కలల పట్ల, సంగీతం పట్ల, భారతీయ సంస్కృతి పట్ల నెమరు వేయాలని పిలుపునిచ్చారు. యువత జీవన విధానంలో మార్పు రావాలని, సంగీతం ద్వారా క్రమశిక్షణ, విలువలు అలవడతాయని పేర్కొన్నారు. మన హుస్నాబాద్ ప్రాంతం కలలకు కానాచి కావాలని, ఇక్కడి కళాకారులు ఎదగాలని ఆకాంక్షించారు. సంగీత గురువు గిటార్ రావు దేశవ్యాప్తంగా యువతను మేలుకొలిపే ప్రయత్నాల్లో నిరంతరం కృషి చేస్తున్న మహానుభావుడని కొనియాడారు. భారతదేశం స్వచ్ఛభారత్‌గా మారినట్లే, సంగీత సంతోష సంబరాల ఆనంద్ భారత్‌గా మారేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

# యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న హిమేష్ ను పరామర్శించిన సోషల్ వెల్ఫేర్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్...

-మెరుగైన చికిత్సకు ఆదేశం...
- ఎంతటి ఖర్చైనా వెనకాడేది లేదు....
- అత్యవసర చికిత్సల నిమిత్తం ఐదు లక్షల మంజూరు ...







**సికింద్రాబాద్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):** యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న జగిత్యాల జిల్లా ధరూర్ క్యాంపు హాస్టల్ విద్యార్థి హిమేష్ ను షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ శనివారం సాయంత్రం పరామర్శించారు. చికిత్స పొందుతున్న హిమేష్ కు అందుతున్న వైద్య సేవలు గురించి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆసుపత్రి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హిమేష్ కు మెరుగైన సేవలు అందించాలని, ఎంతటి ఖర్చైనా భరిస్తామని ఈ సందర్భంగా ఆసుపత్రి యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ పవన్ కుమార్ గోరుకంటి కి మంత్రి లక్ష్మణ్ తెలిపారు. ఇదిలా ఉండగా పిడుగుపాటుతో తీవ్ర గాయాల పాలైన హిమేష్ ను మెరుగైన చికిత్స కోసం మంత్రి ఆదేశంతో సికింద్రాబాద్ లోని యశోద ఆసుపత్రికి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకువచ్చిన వెంటనే అత్యవసర చికిత్స నిమిత్తం యాజమాన్యానికి మంత్రి లక్ష్మణ్ కుమార్ 5 లక్షల రూపాయలను మంజూరు చేసిన విషయం తెలిసిందే. జగిత్యాల జిల్లా ధరూర్ క్యాంపు ఎస్సీ హాస్టల్ విద్యార్థి హిమేష్ పిడుగుపాటు ప్రమాదంలో గాయపడటం బాధాకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. హిమేష్ కు అండగా ఉంటామని, కలత చెందవద్దని హిమేష్ తల్లిదండ్రులకు మంత్రి లక్ష్మణ్ ధైర్యం చెప్పారు. ఎస్సీడిడి అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్, హైదరాబాద్ డిడి ప్రవీణ్ రెడ్డి, ఏడి శ్రీనివాస్, ఉప్పు సత్యనారాయణ తదితరులు మంత్రితో ఉన్నారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంత్రి లక్ష్మణ్ పూజలు



**సిద్ధిపేట, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** సిద్ధిపేట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ సమావేశంపై హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, అవాస్తవాలను నిరూపించాలని స్వామివారి సన్నిధిలో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. ఆయన రాక కోసం రెండు గంటలపాటు ఆలయంలో వేచి ఉన్న మంత్రి, హరీష్ రావు స్పందించకపోవడంతో మీడియాతో మాట్లాడారు. హరీష్ చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని, దండుపాళ్యం సినిమాతో మంత్రివర్గాన్ని పోల్చడం సిగ్గుచేటు అని మంత్రి మండిపడ్డారు. వ్యక్తిగత దూషణలు చేయడం తగదని, “స్థాయి అనేది ప్రజలు నిర్ణయిస్తారు” అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ప్రజా సంక్షేమ అంశాలపై మాత్రమే చర్చ జరిగిందని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ పాత్రను గుర్తు చేసిన మంత్రి, బీఆర్ఎస్ హామీల అమలుపై అంబేద్కర్ విగ్రహం వద్ద చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ఎస్ పాలన తర్వాత, కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. కులగణనపై కేంద్రం స్పందించకపోవడాన్ని విమర్శించారు.

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం

### సమస్యల పరిష్కారానికి చర్చ



**రామగుండం, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ కార్మిక సంఘ్ ఆర్‌జీ -3 ఏరియాలో ఆదివారం (అక్టోబర్ 26) సాయంత్రం 5 గంటలకు యూనియన్ కార్యాలయంలో సమావేశం జరుగుతుంది. డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పున్నమినేని వేణుగోపాల్ రావు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏబీకేఎంఎస్ ఆడిటర్ శ్రీమండా రమాకాంత్, సంఘం అధ్యక్షులు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి సారంగపాణి హాజరవుతారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చర్చించి, నూతన ఏరియా కమిటీని ఏర్పాటు చేయనున్న ఈ సమావేశానికి కార్మిక బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వేణుగోపాల్ రావు పిలుపునిచ్చారు.

# వంగర ఘటనపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించాం: వొడితల ప్రణవ్

-బాలిక మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి
- శవ రాజకీయాలపై మండిపాటు




**భీమదేవరపల్లి, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):** హుజురాబాద్ నియోజకవర్గంలో భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో రాంపూర్‌కు చెందిన బాలిక వర్షిత ఆత్మహత్య ఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విచారణకు ఆదేశించారని, నివేదిక రాగానే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ శనివారం మీడియాతో తెలిపారు. బాలిక కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలిక మృతదేహాన్ని అడ్డుపెట్టుకొని కౌశిక్ రెడ్డి ధర్నా చేయడం సభ్య సమాజం తలదించుకునే చర్య అని, శవ రాజకీయాలు సిగ్గుచేటు అని మండిపడ్డారు. ఓట్ల కోసం సెంటిమెంట్ వాడుకున్న వ్యక్తి ఇప్పుడు మృతదేహాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం దారుణమని విమర్శించారు. కౌశిక్ రెడ్డి లాంటి దౌర్భాగ్యపు ఎమ్మెల్యేను దేశంలో చూడలేదని వ్యాఖ్యానించారు. ఓటు చోరీ ఆరోపణలపై ఎన్నికల సంఘం చెంప చెల్లుమనిపించింది: ప్రణవ్ ఓటు చోరీ జరిగిందని కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఎన్నికల సంఘం గట్టిగా సమాధానం ఇచ్చిందని, గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇదే ఓట్లు అపార్ట్మెంట్‌లో ఉన్నాయని పేర్కొన్నారని తెలిపారు. అసత్య ప్రచారాలు మానుకోవాలని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు తక్షణం ఆపాలని సూచించారు.

# బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించిన మంత్రి

### విద్యార్థులకు ప్రేరణ కలిగించిన లక్ష్మణ్ కుమార్




**సిద్ధిపేట, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్** : సిద్ధిపేట జిల్లా మిట్టపల్లి మరియు ఎల్లుపల్లి గ్రామాలలో ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం సందర్శించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో మాట్లాడిన మంత్రి, ప్రభుత్వం సంక్షేమ రంగంలో చేపట్టిన అభివృద్ధి చర్యలను వివరించారు. క్రమశిక్షణ, నిబద్ధతతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధికి విద్యే మూలమని, అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వసతి సదుపాయాలు, భోజనశాల, తరగతి గదులు, ల్యాబ్‌లు, లైబ్రరీలను పరిశీలించిన మంత్రి, అవసరమైన చోట్ల మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు అధికారులకు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

# రామగుండం డివిజన్ అభివృద్ధికి కృషి చేసిన అధికారులకు మల్లేశ్ ధన్యవాదాలు

**రామగుండం, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ఒకటవ డివిజన్ ఇందిరమ్మ కాలనీ బొడ్రాయి పక్క గల్లిలో మూడు రోజులుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ జామ్ కావడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానికులు డివిజన్ అధ్యక్షులు మడిపెల్లి మల్లేష్‌కు తెలియజేయగా, ఆయన వెంటనే మున్సిపల్ సానిటేషన్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన సిబ్బంది జెట్ మిషన్ ద్వారా డ్రైనేజీ శుభ్రపరిచారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఇంచార్జి కమిషనర్ అరుణశ్రీ, సానిటేషన్ సిబ్బందికి ప్రజల తరఫున మల్లేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇక మేడిపల్లి గ్రామ ప్రజల సౌకర్యార్థం సింగరేణి సీఎస్ఆర్ నిధుల ద్వారా బయో టాయిలెట్స్ నిర్మాణం చేపట్టినట్లు మల్లేష్ తెలిపారు. రైతు వేదిక పక్కన నిర్మించిన టాయిలెట్స్‌ను శనివారం సింగరేణి ఆర్జీవన్ జీఎం



లలిత్ కుమార్ పరిశీలించారు. నిర్మాణం బాగా జరిగిందని అభినందించిన ఆయన, కరెంటు, 24 గంటల నీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే, 26 లక్షల రూపాయలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌కు వంటగది, డైనింగ్ హాల్ లేకపోవడంతో ప్రజలు శుభకార్యాల నిర్వహణలో ఇబ్బంది పడుతున్నారని తెలియజేయగా, వెంటనే స్పందించిన జీఎం లలిత్ కుమార్ అదనపు నిర్మాణానికి ఆదేశాలు ఇచ్చారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, జీఎం లలిత్ కుమార్‌కు డివిజన్ ప్రజల తరఫున మడిపెల్లి మల్లేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ ఎల్. రమేష్, డీజీఎం వరప్రసాద్, ఎస్టేట్ ఆఫీసర్ సాంబశివరావు, సర్వే ఆఫీసర్ జీఎన్ రాజు, ఇన్విరాన్‌మెంట్ ఆఫీసర్ వేణు కుమార్, ఎంఓసిపి మేనేజర్ మల్లికార్జున్ యాదవ్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గుర్రాల మల్లేష్ యాదవ్, గ్రామస్తులు మడ్డి చంద్రయ్య గౌడ్, రవికంటి నాగరాజు, సింగం సతీష్ గౌడ్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

## – కలెక్టర్ దీపక్

**మంచిర్యాల, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. 129.25 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మాణం జరుగుతున్న ఈ ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల బలోపేతానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.




**ఎలక్టోరల్ రివిజన్‌లో పొరపాట్లకు తావు లేకుండా చూడాలి –రాష్ట్ర ఎన్నికల అధికారి**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పొరపాట్లకు తావు లేకుండా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2002 ఎలక్టోరల్ జాబితా ఆధారంగా 2025 జాబితాను నాలుగు కేటగిరీలుగా విభజించి, రాష్ట్రవ్యాప్తంగా 3.33 కోట్ల ఓటర్లను మ్యాపింగ్ చేసినట్లు తెలిపారు. బీఎల్ఓ యాప్ ద్వారా కేటగిరీ ఏ జాబితాను నిర్ధారించి, మిగతా కేటగిరీలను లింక్ చేయాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దీపక్ మాట్లాడుతూ బీఎల్ఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చి, దశలవారీగా ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, రాజస్వ మండలాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి సీనియర్ నాయకుడు నిమ్మల సత్తయ్యకు నివాళులు

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన బిజెపి సీనియర్ నాయకుడు నిమ్మల సత్తయ్య గుండెపోటుతో శుక్రవారం పరమపదించారు. ఈ వార్త తెలిసిన వెంటనే బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డ బోయిన గోపి ఆయన స్వగృహానికి చేరుకుని పార్థివ దేహానికి



పూలమాలలు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ చందుపట్ల లక్ష్మారెడ్డి, జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ ప్రకాష్, మండల అధ్యక్షులు రేపాక రామచంద్రం, మండల ప్రధాన కార్యదర్శి దాసరి గణేష్, నంది నరేష్, బిజెపి సీనియర్ నాయకులు పిట్ల శ్రీశైలం, కమ్మరి ఆంజనేయులు, చందుపట్ల రాంరెడ్డి, బల గౌడ్, రంగు నాగరాజు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం

**సిద్దిపేట, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా అక్టోబర్ 27 మరియు 28 తేదీల్లో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ ఎస్.యం. విజయ్ కుమార్, ఐపీఎస్., ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజుల పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది గ్రామాలను సందర్శించి,



గ్రామస్తుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటారు. పరిష్కరించగలిగిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలు ఉంటే, సంబంధిత శాఖలకు నివేదించి పరిష్కారానికి కృషి చేస్తారు. ఈ అవకాశాన్ని సిద్దిపేట జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారులకు తెలియజేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ, వారి అభ్యున్నతికి పోలీస్ శాఖ కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

# గురుకుల విద్యాసంస్థల అభివృద్ధిపై మంత్రి లక్ష్మణ్ సమీక్ష

## మిట్టపల్లి బాలికల పాఠశాలలో పర్యటన

**సిద్దిపేట, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల్లో విద్య, వసతి, శానిటేషన్, ఆరోగ్య అంశాల్లో ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవో సదానందం, ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆశయాల మేరకు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందించాలన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల సమస్యలపై పూర్తి సమాచారం కోరారు. స్కూల్ యూనిఫాం, పుస్తకాలు, ఆరోగ్య భోజన వసతి, శుభ్రత వంటి అంశాల్లో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కామన్ డైట్ మెనూ అమలు, నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ, ఆకస్మిక తనిఖీల ద్వారా



పర్యవేక్షణ జరగాలని పేర్కొన్నారు. వికలాంగుల కోసం ట్రై సైకిళ్లు, పరికరాల పంపిణీ వేగవంతం చేయాలని, పెండింగ్ బిల్లులు, మౌలిక వసతుల కోసం త్వరలో బడ్జెట్ మంజూరు చేస్తానని తెలిపారు. 200 కోట్లతో 25 ఎకరాల్లో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ఏర్పాటు చేస్తున్నామని, SC, ST, BC, మైనారిటీ విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య, వసతి కల్పిస్తామని చెప్పారు. అదనంగా, మిట్టపల్లి బాలికల గురుకుల పాఠశాలను సందర్శించిన మంత్రి విద్యార్థులతో భోజనం చేసి, మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం అందించిన సిబ్బందిని అభినందించారు. బట్టలు ఆరవేయడానికి ప్లాట్‌ఫామ్ నిర్మాణానికి 10 లక్షలు, ఇతర రిపేర్లకు 15 లక్షలు మంజూరు చేస్తానని తెలిపారు. జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ, విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎదగాలంటే క్రమశిక్షణతో వ్యాయామం అవసరమని సూచించారు. జిల్లాలోని అన్ని గురుకులాలను తనిఖీ చేసి విద్య, భోజన, వసతి పరంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, ఆర్‌సీఓ, డిసిఓ నరసింహచారి, ప్రిన్సిపాల్ లక్ష్మాంజలి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్. జాబితా పకడ్బందిగా తయారు చేయాలి

## - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి




**కరీంనగర్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఓటర్లకు సంబంధించి ఎస్.ఐ.ఆర్. (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) జాబితాను పకడ్బందిగా రూపొందించాలని రాష్ట్ర




ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, 2002 ఎస్.ఐ.ఆర్. డేటాను 2025 స్పెషల్ సమ్మరీ రివిజన్ డేటాతో పోల్చి, కామన్ పేర్లను మినహాయించి, కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలను బూత్ స్థాయిలో ధృవీకరించాలని సూచించారు. బీఎల్ఓల సహకారంతో మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో క్యాటగిరీ 'ఏ' ను బీఎల్ఓ యాప్ ద్వారా ధృవీకరిస్తామని, క్యాటగిరీ 'సి', 'డి' లింక్ ప్రక్రియను శనివారం నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో కెమిస్ట్రీ వారోత్సవాలు

## విజేతలకు బహుమతులు



**కరీంనగర్, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
స్థానిక శ్రీ సరస్వతి శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో కెమిస్ట్రీ వారోత్సవాల సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి మడికొండ వెంకటేష్, ద్వితీయ బహుమతి పెంట్కర్ రామ్ చరణ్, తృతీయ బహుమతి గుంజి వైష్ణవి అందుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేసిన కేప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, రిటైర్డ్ ఎస్.ఆర్.ఆర్. డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ, సైన్స్ మన నిత్యజీవితంతో ముడిపడి ఉందని, ప్రశ్నించడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని, రసాయనశాస్త్రంలో పరమాణువు, అణువుల్లో దాగిన రహస్యాలను అధ్యయనం చేయడం ద్వారా మంచి పరిజ్ఞానం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, మేచినేని దేవేందర్ రావు, చిపిరిశెట్టి సత్యనారాయణ, ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులను డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, డాక్టర్ నాళ్ల సత్య విద్యాసాగర్, గట్టు శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, కొత్తూరి ముకుందం, గోలి పూర్ణచందర్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, నడిపెల్లి దీన్ దయాల్, అప్పిడి వకులాదేవి తదితరులు అభినందించారు.

# నిరుపేద కుటుంబానికి ఏఎస్ఐ శ్రీనివాస్ ఆర్థిక చేయూత

**జగిత్యాల, అక్టోబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గోపులాపూర్ గ్రామానికి చెందిన ముత్యాల రాజు కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. తండ్రి మృతి చెందగా, తల్లి కళ్ళు కనిపించక, భార్యకు ఫిట్స్ వ్యాధి ఉండడంతో కుటుంబం అనారోగ్య భారం మోయాల్సి వచ్చింది. చిన్న వయసులోనే రాజుకు కాలుకు ఇన్ఫెక్షన్ రావడంతో ఆపరేషన్ చేసి ఐరన్ రాడ్ అమర్చారు. బరువు పనులు చేయలేని పరిస్థితిలో



కుటుంబ జీవనం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో వాసవి సేవాదళ్ జగిత్యాల ఆధ్వర్యంలో ఏఎస్ఐ రాజేశుని శ్రీనివాస్ మూడు వాట్సాప్ గ్రూపుల ద్వారా దాతల సహకారంతో 37,446/- రూపాయల ఆర్థిక సహాయాన్ని సేకరించారు. ఈ మొత్తాన్ని స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఎండ్. ఆరిఫ్ అలీ ఖాన్ చేతుల మీదుగా ముత్యాల రాజుకు అందజేశారు. శ్రీనివాస్ సేవా కార్యక్రమాలను కొనియాడిన ఇన్స్పెక్టర్, ఆయన భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ ఉదాహరణ సామాజిక బాధ్యతకు ప్రతిరూపంగా నిలిచింది.